# నేరము శిక్ష

డిజిపి ఉత్తమ్ సింగ్ కారు వేగంగా రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్ వైపు పరుగుతీస్తోంది. ఆయన క్షణక్షణానికి తన గడియారం వైపు చూసుకుంటున్నారు. దేశభద్రతకు సంబంధించిన ఓ ముఖ్యమైన సమాచారాన్ని సేకరించిన క్రైం బ్రాంచ్ ఎస్ఐ ఆకాష్ దీక్షిత్ ప్రాణాపాయ స్థితిలో హాస్పిటల్లో చేరాడు. అతను సేకరించిన సమాచారం సామాన్యమైంది కాదు. ఇంటర్నేషనల్ మాఫియాకు చెందిన డ్రగ్ స్మగ్లర్ మంథన్ అరోరాకు సంబంధించిన అతి ముఖ్యమయిన సమాచారాన్ని తన మస్తిష్కంలో భద్రపరచుకున్నాడు ఆకాష్ దీక్షిత్. పదిరోజుల క్రితం ఇంటర్నేషనల్ టెర్రరిస్టుల ఆచూకీ అన్వేషించడానికి స్పెషల్ అసైన్‌మెంట్ మీద వెళ్లాడు దీక్షిత్. ఆ తరువాత అతని జాడ తెలియలేదు.

ఒక దశలో ఉగ్రవాదుల చేతిలో హతమయ్యాడని అనుకొని ఆశ వదులుకుంది డిపార్ట్‌మెంట్.

# ద్విముఖం

## ఆదిత్య

కాని ఆశ్చర్యంగా నిన్న రాత్రే ఢిల్లీ నగర శివార్లలో తీవ్రమైన గాయాలతో ఆకాష్ దీక్షిత్ హైవే పోలీసులకు కనిపించడంతో వాళ్లు అతన్ని హాస్పిటల్లో చేర్పించారు. ఆ వెంటనే డాక్టర్ మల్‌హోత్ర డిజిపి ఉత్తమ్‌సింగ్‌కు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న వెంటనే ఆయన బయలుదేరారు. కారు స్పీడో మీటర్ వంద దాటినా ఆయనకు అసహనంగానే వుంది.

★ ★ ★

డాక్టర్ మల్‌హోత్రా దీక్షిత్ ఆరోగ్య పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షిస్తున్నాడు. స్పెషల్ వార్డులో ఎసి గాలి చల్లగా వీస్తోంది. దీక్షిత్‌ను వెంటిలేషన్‌లో వుంచారు. ఉండి ఉండి దీక్షిత్ భారంగా తీస్తున్న ఊపిరి శబ్దం తప్ప మరే శబ్దమూ వినిపించడంలేదక్కడ. తలకు పెద్ద బ్యాండేజ్ కట్టబడి వుంది. ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ''టింగ్.. టింగ్...'' మంటూ అతని సెల్ మోగింది.

సెల్ ఆన్ చేసి ''హాల్లో...'' అన్నాడు డాక్టర్. ఫోన్‌లో సంభాషణ వింటూనే ఆ స్వరం డిజిపిదిగా గుర్తించి, 'ఇప్పుడేం చెప్పలేను. కనీసం నలభై ఎనిమిది గంటలు గడిస్తే కానీ అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా వుండేది లేనిది చెప్పలేం సార్..' అంటూ మర్యాదగా చెప్పాడు.

''ఇదిగో... నే... వచ్చేస్తున్నా... ట్రాఫిక్‌లో చిక్కుకున్నా. దీక్షిత్‌ను జాగ్రత్తగా ట్రీట్ చెయ్యండి.. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు...''ఉత్తమ్ సింగ్ ఫోన్‌లో సలహాలిస్తున్నాడు. ఇంతలో ఫోన్‌లోనే 'దడ...దడ...'మని తుపాకీ మోతల చప్పుడు వినిపించింది.

''షిట్...దీక్షిత్‌ను ఇక్కడ చేర్చినట్లు విద్రోహులకు తెలిసిపోయింది. వెంటనే అతన్ని అక్కడ నుంచి తప్పించండి... క్విక్...'' అంటూ ఆజ్ఞలు జారీ చేసాడు ఉత్తమ్ సింగ్.

★ ★ ★

కంటోన్మెంట్ ప్రాంతంలోని ఓ స్పెషల్ కాటేజీలో వుంచి దీక్షిత్‌కు ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. మూడు రోజుల తర్వాత ఆకాష్‌దీక్షిత్ కళ్లు తెరిచాడు. ఆ విషయం గమనించిన డాక్టర్ మల్‌హోత్రా ఆ వార్తను డిజిపి ఉత్తమ్ సింగ్‌కు తెలియజేసాడు. క్షణాల్లో అక్కడకు చేరుకున్నాడు డిజిపి. వస్తూనే నేరుగా దీక్షిత్ వున్న రూమ్ చేరుకున్నాడు.

దీక్షిత్ భారంగా కనురెప్పలు కదిలించి ఉత్తమ్‌సింగ్ వైపు చూస్తూ ఏదో చెప్పాలని నోరు తెరిచాడు. కాని వెంటనే నోటి నుంచి మాట పెగల్లేదు. కళ్లు టపటప కొట్టు




కుంటున్నాయి. అతని మొహంలో ఆందోళన గమనించిన డాక్టర్ అతన్ని డిస్టర్బ్ చెయ్యొద్దు అన్నట్లుగా ముందుకు జరిగాడు. అది గమనించిన దీక్షిత్ తనను వారించొద్దు అన్నట్లుగా చేతుల్తో సైగ చేసాడు. శక్తినంతా కూడదీసుకొని తను సేకరించిన సమాచారం డిజిపికి తెలియజేయాలని గొంతు విప్పాడు. దీక్షిత్ ఏం చెబుతాడో వినడానికి ఆసక్తిగా ముందుకి జరిగాడు ఉత్తమ్‌సింగ్.

★ ★ ★

ఆరోజు కన్నాట్‌ప్లేస్ దగ్గరి 'కాకా దాబా'లో డిన్నర్‌కు ఆర్డర్ ఇచ్చి చుట్టూ మనుషుల్ని గమనిస్తూ కూర్చున్నాను. నా వెనుక సీట్లో కూర్చున్న వ్యక్తి సెల్‌లో సంభాషణ నా చెవినపడింది.

''నేనే మంథన్‌ని మాట్లాడుతున్నా... మీరు ఫోన్ కట్ చేయండి. బయట పబ్లిక్ బూత్ నుంచి మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తా....'' అంటూ మంథన్ గబగబా బయటకి నడవడం గమనించాను.

వెయిటర్ డిన్నర్ తెస్తున్నా అతని చేతిలో డబ్బులుంచి మంథన్‌ని ఫాలో అయ్యా. మంథన్ కొద్ది దూరంలో వున్న పబ్లిక్ బూత్‌లోకి వెళ్లి కాయిన్ వేసి ఫోన్ చేయసాగాడు. ఓ అయిదు నిమిషాల అనంతరం బయట కొచ్చి తన కార్లో బయలుదేరాడు. నేను ఆలస్యం చేయకుండా కాయిన్ వేసి రీడయల్ చేసాను వెంటనే...

''మంథన్....నేనే చీఫ్‌ను. మళ్లీ ఎందుకు చేసావ్'' అని అడగడం వినిపించింది.

కొంచెం గొంతు మార్చి ''కారు ట్రబుల్ ఇస్తోంది...'' అన్నాను.

''కొంచెం లేటయినా పర్లే...నే.. వెయిట్ చేస్తా...'' అంటూ ఫోన్ కట్ చేసాడు అతను.

ఆ క్షణంలో నాకు చీఫ్‌ను చూడాలనిపించింది. బైక్ తీసుకొని మంథన్‌ని ఫాలో అయ్యా. ఆగ్రా హైవేపై కనిపించింది మంథన్ కారు. రోడ్డు పక్కకు జరిగి పిల్ల బాట గూండా చాలా దూరం సాగింది కారు. అలా అరగంట ప్రయాణించిన తరువాత ఓ పాడుబడ్డ బంగళా ముందు కారు ఆగింది.

మంథన్ బంగళా లోపలకి వెళ్లాడు. నేను కూడా బైక్‌ని దూరంగా పార్క్ చేసి బంగళాలోకి వెళ్లా. అక్కడ మంథన్ మరో వ్యక్తితో మాట్లాడుతున్నాడు. ''ఆలస్యమయిందేమిటి? పదపద... అక్కడ బాస్ మన కోసం ఎదురు చూస్తున్నాడు...'' అంటూ మళ్లీ బయటకు రావడం కనిపించింది.

దూరం నుంచే నా సెల్‌కెమేరాతో ఫొటో తీసి వాళ్ల కన్నా వేగంగా కారు దగ్గరకి చేరి కారు డిక్కీలో కూర్చున్నాను. వెంటనే కారు బయలుదేరింది. ఓ అర గంట ప్రయాణం సాగింది. తరువాత మళ్లీ ఎక్కడో కారు ఆగింది.

అక్కడ మూడో వ్యక్తి కంఠం వినిపించింది.

''మంథన్... మన నాయకుడు జాఫర్‌ను ఎలాగైనా మనం విడిపించాలి. అందులో భాగంగా మరో రెండురోజుల్లో డిజిపి కూతురు శివానీని కిడ్నాప్ చేయబోతున్నాము. అప్పుడు డిజిపి ఉత్తమ్ సింగ్ మనను వెదుక్కుంటూ వస్తాడు. తన కూతురుకు బదులుగా జాఫర్‌ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తాం...'' ఎలా వుంది మన ప్లాన్ అడిగాడా మూడోవ్యక్తి.

''బ్రహ్మాండం బాస్... ఇంతకీ శివానీని ఎప్పుడు కిడ్నాప్ చేస్తున్నాం?'' అడిగాడు మంథన్.

''మరో రెండురోజుల్లో....''

వీళ్ల సంభాషణ ఇలా సాగుతుంటే డిక్కీలో వున్న నా సెల్‌ఫోన్ రింగయ్యింది. ఆ శబ్దం వింటూనే వాళ్లకు అనుమానం వచ్చి డిక్కీ తెరిచి చూసారు. డిక్కీలో వున్న నన్ను బయటకు లాగారు. నన్ను చూస్తూనే చీఫ్ కోపంగా..

''బద్మాష్... సిబిఐ మనిషి వీడు. వీడు ప్రాణాల్తో వుండడానికి వీల్లేదు. వీడిని షూట్ చేయండి'' అన్నాడు.

ఇక చావు ఖాయం అనుకున్నా. చావు ధైర్యంతో వాళ్లను తోసుకుంటూ చీకట్లో పరుగెత్తా. ఊహించని పరిణామానికి వాళ్లు కిందపడ్డారు.

నాకు దారి తెలియలేదు.

ముందు జాగ్రత్తగా ఓ ప్లాస్టిక్ కవర్లో సెల్ పెట్టి దాన్ని ఓ చెట్టు మొదట్లో దాచి ఆగకుండా పరుగుతీసా. వాళ్లు పేల్చిన తుపాకీ గుండు భుజంలో దూసుకుపోయింది. అయినా ఆగకుండా పరిగెత్తా.

అలా ఓ అరగంట సేపు దారితెన్నూ తెలియక ఆ చీకట్లో అలా పరుగుతీసా. అక్కడో బావి వున్న సంగతి గమనించలేదు నేను. కాలు జారి అందులో పడిపోయా. అంతే తెలివి తప్పింది.

ఇదిగో మళ్లీ ఈ రోజే మీతో మాట్లాడడం... అంటూ చెప్పడం పూర్తి చేశాడు దీక్షిత్.

★ ★ ★

దీక్షిత్ చెప్పిందంతా జాగ్రత్తగా విన్నాడు డిజిపి ఉత్తమ్ సింగ్.

దీక్షిత్ చెప్పినట్లుగానే ఆయనకూతురు శివానీని దుండగులు కిడ్నాప్ చేసి కరడుగట్టిన ఉగ్రవాది జాఫర్ ఖాన్ విడుదలకు బేరం పెట్టారు. శాంతిభద్రత దృష్ట్యా ఈ విషయాలు ఎక్కడా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డాడు. ముఖ్యంగా ప్రెస్ వాళ్లకు ఈ విషయాలేవీ తెలియనివ్వలేదు.

''దీక్షిత్ నువ్వు చెప్పినట్లుగా ఆ దుండగులు నా కూతుర్ని కిడ్నాప్ చేశారు. వాళ్లను కొంచెం గడువు అడిగాం. అదృష్టవశాత్తూ నువ్వు తిరిగి వచ్చావు. ఇప్పుడు చెప్పు నువ్వు వాళ్ల స్థావరాన్ని గుర్తించగలవా...?'' అడిగాడు ఉత్తమ్‌సింగ్.

''ఆరోజు రాత్రి డిక్కీలో ఉన్నాను. వాళ్లు వెళ్లిన మార్గాన్ని గుర్తించడం కొంచెం కష్టమే. అయితే ఆ కారు ఎన్ని మెలికలు తిరిగిందో గుర్తుపెట్టుకున్నా. అంతే కాదు ఆ స్థావరం రైల్వే లెవల్ క్రాసింగ్‌కు దగ్గరలో వుంది. రైలు కూత స్పష్టంగా వినిపించింది నాకు.''

''గుడ్ ఆ మాత్రం ఆనవాళ్లు చాలు. నువ్వు కళ్లకు గంతలు కట్టుకొని కూర్చో. నేను టెస్ట్ చేస్తా...''

''మరి జాఫర్ ఖాన్...?'' అడిగాడు దీక్షిత్.

''వాడూ కూడా మన వెంటే వుంటాడు. అవకాశాన్ని బట్టి జాఫర్‌ను, ఆ చీఫ్‌ను అక్కడే మట్టుపెట్టి శివానీని తీసుకొద్దాం..'' చెప్పాడు ఉత్తమ్‌సింగ్.

''అలాగే సార్...'' అంటూ అంత నిస్సత్తువలోనూ చెయ్యెత్తి సెల్యూట్ చేసాడు ఆకాష్ దీక్షిత్.

''ఈ స్టేట్‌మెంట్ పై సంతకం చెయ్యి...'' అంటూ ఉత్తమ్‌సింగ్ ఓ ఫైల్ ముందుంచాడు. దీక్షిత్ వెంటనే సంతకం చేసి '' ఈ ఆపరేషన్ ఎప్పుడు స్టార్ట్ చేద్దాం సార్...''

''వెరీ సూన్...'' అంటూ అక్కడి నుంచి నిష్క్రమించాడు డిజిపి ఉత్తమ్‌సింగ్.

★ ★ ★

చీకట్లో జీపు వేగంగా పోతోంది. డ్రైవింగ్ సీట్లో ఉత్తమ్‌సింగ్ వున్నాడు. ఆయన పక్కనే ఆకాష్ దీక్షిత్ కళ్లకు గంతలు కట్టుకొని...''లెఫ్ట్...రైట్'' అంటూ దారి చెబుతున్నాడు.

వెనుక జీపులో జాఫర్‌ఖాన్ బంధింపబడి వున్నాడు.

కొంత దూరం ప్రయాణం సాగిన తరువాత...

''ఇక్కడే... ఇక్కడే... ఆపండి...'' అన్నాడు దీక్షిత్.

దుమ్ము రేపుకుంటూ జీపులు రెండూ ఆగాయి. అక్కడే ఓ పాడుబడ్డ బిల్డింగ్ కనిపించింది. జీపుల శబ్దం వినపడగానే బిల్డింగ్‌లో నుంచి ఇద్దరు మనుషులు వచ్చారు. వాళ్ల మధ్యన శివానీ భయంగా నిలుచుని వుంది.

దీక్షిత్ తన కళ్లకున్న గంతలు విప్పుకున్నాడు. ఉత్తమ్‌సింగ్ ముందుగా జీపు దిగాడు. ఆయన పక్కనే దీక్షిత్ నిల్చున్నాడు.

అప్పుడు జరిగిందా సంఘటన...

దీక్షిత్ హటాత్తుగా డిజిపి ఉత్తమ్‌సింగ్ నడుముకు వేలాడుతున్న రివాల్వర్‌ను చేతిలోకి తీసుకొని డిజిపికి గురిపెట్టి....

''హ్యాండ్సప్... మిస్టర్ డిజిపి... మీ వాళ్లకు చెప్పండి... కదలొద్దని... జాఫర్‌ఖాన్‌ని మాత్రం ఇటు తీసుకురండి...'' అంటూ ఆజ్ఞాపించాడు.

ఆ దృశ్యం చూస్తూనే అక్కడున్న వాళ్లందరూ నివ్వెరపోయారు. 'ఈ దీక్షిత్‌కు ఏమయింది మెంటలెక్కిందా?' లేక డబ్బుకోసం దేశద్రోహులకు అమ్ముడు పోయాడా...? అన్న సందిగ్ధంలో ఉండిపోయారందరూ.

శివానీ ''డాడీ......'' అని ఏడుస్తోంది. మరోపక్క జాఫర్‌ఖాన్ వికటాట్టహాసం చేస్తున్నాడు.

అయితే ఉత్తమ్‌సింగ్ వీటన్నింటిని లెక్కచేయకుండా సూటిగా దీక్షిత్ కళ్లలోకి చూస్తూ దీక్షిత్ వైపే అడుగులేయసాగాడు.

''ఉత్తమ్‌సింగ్ అక్కడే నిలబడు. మరొక్కడుగు వేశావంటే నిర్దాక్షిణ్యంగా షూట్ చేస్తాను... నేనసలే మంచి వాడిని కాదు...'' అని బెదిరించసాగాడు ఆకాష్ దీక్షిత్.

అయినా బెదిరిపోలేదు డిజిపి. వెనుకడుగు వేయలేదు. ముందడుగు వేయసాగాడు.

దీక్షిత్ రివాల్వర్ ట్రిగ్గర్ నొక్కాడు... తుస్‌మంది. అందులో బుల్లెట్స్ లేవు. డిజిపి నోటి నుంచి బుల్లెట్ లాంటి మాటలు వెలువడ్డాయి...''మిస్టర్ మంథన్ అరోరా.. ఇక చాలించు నీ నాటకం... మీ గుట్టు బయట పడుతుందని దీక్షిత్‌ను హతమార్చావు. నువ్వు ప్లాస్టిక్ సర్జరీ చేసుకొని దీక్షిత్‌గా రూపుమార్చుకొన్నావు. మమ్మల్నందరినీ తప్పుదారి పట్టించాలని చూసావు. ఓ కట్టు కథ అల్లావు. దీక్షిత్‌గా పరకాయ ప్రవేశం చేసావు కానీ.. దీక్షిత్ అలవాట్లు తెలుసుకోలేకపోయావు. దీక్షిత్ లెఫ్ట్‌హ్యాండర్. కానీ నువ్వు కుడిచేత్తో సంతకం చేసావు. దీక్షిత్‌ది 'ఓ' గ్రూప్ బ్లడ్. నీది 'బి' గ్రూప్. మమ్మల్ని తక్కువగా అంచనా వేసావు. నీ ఆటకట్టు.'' అంటూ చప్పట్లు కొట్టేసరికి.

పదిజీపుల ఫ్లడ్‌లైట్స్ వెలిగాయక్కడ.

శివాని ఒక్క పరుగున తండ్రి ఒడి చేరింది.

అవాక్కయి నిల్చున్నారు మంథన్, జాఫర్.

''నీ బుద్ధి తెలిసే మా జాగ్రత్తలో మేమున్నాము. బుల్లెట్లు లేని రివాల్వర్ నా దగ్గరుంచుకున్నాను. నీకు తెలియకుండా నా వాళ్లు నన్ను ఫాలో అయ్యారు.'' అంటూ శివానీని తీసుకొని జీపు ఎక్కి స్టార్ట్ చేశాడు డిజిపి ఉత్తమ్ సింగ్.

మరో రెండు నిమిషాలకు దడ....దడమంటూ ఆ ప్రాంతమంతా తుపాకీ మోతతో మారుమ్రోగింది.

★ ★ ★

మరునాడు ఉదయం ఢిల్లీ లోని అన్ని వార్తా పత్రికలలో '' ఉగ్రవాదులు మంథన్, జాఫర్‌ఖాన్‌లు ఎన్‌కౌంటర్‌లో మృతి' అని పడింది.

★

## వారెంత అజ్ఞానులు...?

వాతావరణం విషయంలో అమెరికన్స్ ఎంత భయపడతారో, జంక్ సైన్స్‌ని ఎంతగా అనుసరిస్తారో తెలిపే ఓ సంఘటన ఇది. గ్రేటర్ ఇడాహోఫాల్ సైన్స్ ఫేర్‌లో పాల్గొన్న ఈగిల్‌రాక్ జూనియర్ హైస్కూల్‌కి చెందిన ఓ విద్యార్థి. ఓ కంప్యూటర్‌లో ఇలా ఫీడ్ చేసాడు ఆ విద్యార్థి.

'డి హైడ్రోజన్ మోనాక్సైడ్' అనే రసాయనిక పదార్థాన్ని పూర్తిగా బహిష్కరించడానికి మీరు ఎస్ బటన్‌ని, లేదా బహిష్కరించవద్దనుకుంటే నో బటన్‌ని, ఏదీ తేల్చుకోలేకపోతే అన్‌డిసైడెడ్ బటన్‌ని నొక్కండి.

దాన్ని బహిష్కరించడానికి కారణాలివి.

1. దానివల్ల మనుషులకి ఎక్కువ చమట, వాంతులు, విరేచనాలు కలుగుతాయి.
2. యాసిడ్ రెయిన్స్‌లో ఇది పెద్ద భాగం.
3. దీన్ని పొరపాటున పీలిస్తే మరణం తప్పదు.
4. ఇది తుప్పుకి ప్రధాన సహాయకారి.
5. ఆటోమొబైల్ బ్రేకుల సమర్థతని ఇది తగ్గిస్తుంది.
6. టెర్మినల్ కేన్సర్ రోగుల ట్యూమర్స్‌లో ఇది కనుగొనబడింది.
7. ఇతర పదార్థాలతో కలిస్తే, ఇది వాటిలో రసాయనిక మార్పులను తెస్తుంది.
8. వాయువు రూపంలో ఇది శరీరాన్ని కాలుస్తుంది.

ప్రతి యాభై మందిలో నలభైమూడు మంది దాన్ని బహిష్కరించాలన్న బటన్‌ని నొక్కారు. ఆరుగురు ఎటూ తేల్చుకోలేకపోయారు. ఒకరు మాత్రం 'నో' బటన్‌ని నొక్కారు. బహుశా అతనికి మాత్రమే అది 'హెచ్ టూ ఓ' అంటే నీరు అని తెలిసివుంటుంది.

వారెంత అజ్ఞానులు?

– మల్లాది వెంకట కృష్ణమూర్తి.